జగనన్న నాయకత్వంలోనే సుభిక్ష పాలన

మాచవరం: రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో గత నాలుగున్నరేళ్లలో సుభిక్ష పాలన సాగిందని, ప్రతి గడపకూ లబ్ధి చేకూర్చిన ఘనత జగన్‌కే దక్కుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య అన్నారు. మండలంలోని చెన్నాయపాలెం గ్రామ సచివాలయంలో వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముందుగా గ్రామంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తుందని తెలిపారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా క్షేత్రస్థాయిలోనే ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, వైస్ ఎంపీపీ నన్నేషైదా, సర్పంచ్ మండ్ల మంగమ్మ, రేగులగడ్డ సర్పంచ్ కొండలు, స్వామి, సొసైటీ మాజీ అధ్యక్షుడు వట్టి రామిరెడ్డి, రామకోటయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలపాలని కోరుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు

రికార్డు స్థాయిలో మేనిఫెస్టోలోని 99 శాతం హామీల అమలు

కారెంపూడి: పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న 99 శాతం హామీలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అలాంటి విశ్వసనీయత కలిగిన నాయకుడు రాష్ట్ర భవిష్యత్తుకు చాలా అవసరమని మండల జేసీఎస్ కన్వీనర్ అల్లు వెంకటేశ్వర రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చినగార్లపాడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం మంగళవారం రాత్రి నిర్వహించారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల బోర్డును ఆవిష్కరించారు. ఇంటింటికి వెళ్లి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు. గ్రామ సర్పంచ్ బి.బుజ్జి శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ ఎం.శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, వైస్ ఎంపీపీ బి.అల్లయ్య సావిత్రి, మండల పార్టీ అధ్యక్షుడు కె.సుబ్రమణ్యం, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగన్ పాలన పలు రాష్ట్రాలకు ఆదర్శం

గురజాల : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన పలు రాష్ట్రాలకు ఆదర్శంగా ఉందని ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి అన్నారు. మండల పరిధిలోని పులిపాడు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉంటేనే ఆంధ్రప్రదేశ్ బాగుపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు సీఎంకు మద్దతు పలకాలన్నారు. ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలంటే సీఎంగా జగన్ ఉండాలన్నారు. ప్రతి ఒక్కరి ఆశీస్సులు జగన్‌కు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, మణి, తదితరులున్నారు.



చింతలతండా గ్రామంలో జగనన్న ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తున్న బూడిద శ్రీను

రాష్ట్ర అభివృద్ధికి జగనన్న కావాలి

వెల్దుర్తి: ఆంధ్రరాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు సీఎంగా కావాలని మండల పరిషత్ అధ్యక్షులు చింతా శివరామయ్య అన్నారు. మంగళవారం శ్రీరాంపురం తండాలో గడప గడపకు తిరిగి సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను వివరించి మాట్లాడారు. సీఎం జగన్ ప్రజలకు మేలు చేసేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వలంటీర్ల ద్వారా ప్రతి ఇంటి నుంచి లబ్ధిదారులను గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాయంకుల గోపాల్, మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు చల్లా పిచ్చయ్య, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మేకల కోటిరెడ్డి, కండ్లకుంట సొసైటీ అధ్యక్షుడు తాడికొండ పుల్లారెడ్డి, గ్రామ సర్పంచ్ చల్లా శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ బొజ్జా అంజిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతా ఆదినారాయణ, దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పోలకం వెంకటనారాయణ, గోనుగుంట శ్రీనివాసరెడ్డి, తోట ఆంజనేయులు, గుండెబోయిన నాగేశ్వరరావు, చౌడయ్య, ఇన్నయ్య, వలంటీర్లు, గృహసారథులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో పేదల జీవితాలలో వెలుగులు

విజయపురిసౌత్: మహాత్మాగాంధీ కలలు సాకారం చేసి గ్రామాల పురోభివృద్ధి, పేదల జీవితాలలో వెలుగులు నింపిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని మాచర్ల ఎంపీపీ తనయుడు బూడిద శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మాచర్ల మండలంలోని చింతలతండా గ్రామంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గిరిజనులు అభ్యున్నతికి సీఎం జగనన్న అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. మాచర్ల జెడ్పీటీసీ సభ్యుడు మల్లుస్వామి, గ్రామ సర్పంచ్ కేతావత్ శ్రీనునాయక్, ఎంపీటీసీ బుజ్జి సీతానాయక్, ఉమ్మడి గుంటూరు జిల్లా గొర్రెల పెంపకందారుల యూనియన్ చైర్మన్ బూడిద సైదులు, జగనన్న సురక్ష కన్వీనర్ శేరెడ్డి వీరారెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, కంభంపాడు గ్రామ పెద్ద ఆరికట్ల చంద్రశేఖర్‌రెడ్డి, లచ్చునాయక్, జటావత్ శ్రీనునాయక్, రమావత్ బిత్యాలు, భీమానాయక్, కేతావత్ పరిశ్య, జటావత్ గాసీరామ్, కేతావత్ హనుమా, వలంటీర్లు పాల్గొన్నారు.



శ్రీరాంపురం తండాలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు, కార్యకర్తలు



పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు

వైఎస్సార్‌సీపీలో చేరిన చింతపల్లి గ్రామ టీడీపీ నాయకులు

కారెంపూడి: మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు ఆ పార్టీని వీడి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) సమక్షంలో వైఎస్సార్‌సీపీలో మంగళవారం చేరారు. వారికి పీఆర్కే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పంగులూరి అంజయ్య, పంగులూరి రంగయ్య, చిరుమామిళ్ల శివరామకృష్ణ, షేక్ అల్లి సాహెబ్, పంగులూరి శ్రీను, బంక మరియ దాసు, గమిడి నాగేశ్వరరావు, గమిడి శివయ్య, గంటా వీరయ్య వారి అనుచరులు ఉన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి పంగులూరి రామకృష్ణయ్య, అలుగునూరి అమరయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పని చేసే పార్టీ అని పేర్కొన్నారు. కుల మతాలకతీతంగా ప్రజలందరి మేలు కోసం పరితపించే పార్టీ అని అందరం కూడా వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఎంతైనా అవసరం ఉందని అన్నారు. పార్టీలో చేరిన వారిని పేరుపేరునా అభినందించారు. పీఆర్కే మంచి మనసు ఉన్న వ్యక్తి అని ఆయన సమర్థ నాయకత్వంలో పనిచేయడానికి వైఎస్సార్‌సీపీలో చేరామని పార్టీలో చేరిన వారు వెల్లడించారు.



పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

బ్రాహ్మణపల్లిలో రూ.40 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి

గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల రూరల్: ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తూ బ్రాహ్మణపల్లి గ్రామంలో రూ.40 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం రెండవ రోజు బీసీ రజక కాలనీ నుంచి కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రూ.కోటి నలభై లక్షలతో ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలోనే పనులు చేపట్టి ఏడాదిలోగా పూర్తి చేస్తామన్నారు. గ్రామంలో ఇప్పటికే ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా రూ.25,14,43,245, పరోక్ష నగదు బదిలీ ద్వారా రూ.7,21,98,017 లబ్ధి చేకూరిందని వివరించారు. ప్రభుత్వ భవన నిర్మాణాలు, నాడు- నేడు ద్వారా స్కూళ్ల అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.6 కోట్ల 28 లక్షలతో పనులు చేపట్టామని తెలిపారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా అందుతున్న ప్రజా సేవలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు మార్చారని అన్నారు. మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వీరభద్రుని రామిరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరెడ్డి, గ్రామ సర్పంచ్ పి.వీరరాఘవయ్య, మాజీ సర్పంచులు షేక్ ఖాశింబీ, బడేసా, చంద్రారెడ్డి, ఎంపీటీసీలు నాగిరెడ్డి, శ్రీనివాసరావు, పోలె బూదయ్య, వెన్నా శ్రీనివాసరెడ్డి, అద్దంకి శ్రీనివాసరావు, బలుగూరి కాశయ్య, మార్కెట్ షైదా, సుబ్బయ్య శేఖర్‌బాబు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పేటసన్నెగండ్లకు మహర్దశ

- గ్రామ మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు
- లిఫ్ట్ వద్ద చెక్ డ్యాం నిర్మాణం
- అక్కడ నుంచి పైపులైన్ ద్వారా గ్రామ చెరువుకు నీరు
- అందుకు రూ.1.5 కోట్లు కేటాయింపు

కారెంపూడి: చిరకాలంగా మంచినీటి ఎద్దడి ఎదుర్కొంటున్న మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామ ప్రజల తాగు నీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. 1.5 కోట్లు మంజూరు చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గ్రామ సమస్యను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఇటీవల మాచర్ల వరికెపూడిశెల లిఫ్ట్ ఇరిగేషన్ శంకుస్థాపనకు విచ్చేసిన ఆయన సమస్య పరిష్కారానికి రూ.1.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా ఎవరూ పట్టించుకోని తమ గ్రామ సమస్య ప్రభుత్వ విప్ పీఆర్కే ప్రత్యేక శ్రద్ధతో పరిష్కారం కానుండడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామ సమస్య గురించి ఆలోచన చేసింది.. ఆనాడు వైఎస్సార్..నేడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే

ఆంధ్రప్రదేశ్ నీటి పారుదల అభివృద్ధి సంస్థ స్వర్గీయ రాజశేఖరరెడ్డిగారి హయాంలో రూ.2.95 కోట్లతో గ్రామంలోని 1,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు పేటసన్నెగండ్ల ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. అయితే అది నీటి లభ్యత లేక వినియోగంలోకి రాలేదు. ఆ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. లిఫ్ట్ వద్ద చెక్ డ్యామ్ నిర్మించి అక్కడ నుంచి 1.5 కిలోమీటర్లు పైపులైన్ వేసి చెరువును నీటితో నింపేందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. చెరువు జలాశయంగా మారితే భూగర్భ జలాలు పడిపోకుండా ఉంటాయి. గ్రామంలోనూ, పొలాల్లోని బోర్లలో నీటి లభ్యత పెరుగుతుంది. గ్రామానికి దక్షిణ దిక్కులో ఉన్న గాదెవారిచెరువు విస్తీర్ణం 82 ఎకరాలుంది. వర్షం పడితే నల్లమల అటవీ ప్రాంతంలోని సమీపంలో వర్షం నీరు చెరువుకు చేరుతుంది. కాని వర్షాభావ పరిస్థితులు తలెత్తినప్పుడు చెరువులో చుక్కనీరుండడంలేదు. చెరువు ఎప్పుడూ నీటితో కళకళలాడేలా చూడాలనేదే ప్రభుత్వ సంకల్పం.

దశాబ్దాల సమస్యకు చక్కని పరిష్కారం..

ప్రస్తుతం ఉన్న ఎత్తిపోతల పథకం వద్ద చెక్ డ్యాం నిర్మించి అక్కడికి సమీపంలో నాగులేరు వాగును కలుపుతూ ఉన్న ఎస్కేప్ చానల్ ద్వారా సాగర్ కుడి కాల్వ నీటిని లిఫ్టుకు అందించాలనేది ప్రభుత్వ ప్రణాళిక. నాగులేరు వాగుకు వరద వచ్చినా చెక్ డ్యాంలో నిల్వ చేసుకునే వీలు ఉంటుంది. వాగుకు వరద రాని రోజుల్లో సాగర్ కుడి కాల్వ నీటిని లిఫ్ట్ ద్వారా పేటసన్నెగండ్ల గ్రామ ప్రజల దాహార్తిని తీర్చడానికి చెక్‌డ్యామ్ నింపి అక్కడ నుంచి లిఫ్ట్ చేసి పైపులైన్ ద్వారా చెరువుకు తరలించనున్నారు. గ్రామ చెరువు మంచినీటి జలాశయంగా మారిపోతుంది. దీంతో దశాబ్దాలుగా గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సాగు, తాగునీటి కష్టాలు తీరనున్నాయి.



పేటసన్నెగండ్ల ఎత్తిపోతల పథకం మోటార్ల షెడ్

కుల గణనతో సామాజికాభివృద్ధి

మాస్టర్ ట్రైనర్ సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ కె.షమ్మి

పిడుగురాళ్ల: కులగణనతో సామాజికాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కులగణన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కులగణన మాస్టర్ ట్రైనర్ సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ కె.షమ్మి తెలిపారు. పట్టణంలోని మార్కెట్ యార్డు ప్రాంగణంలో మంగళవారం కులగణన కార్యక్రమంపై సచివాలయ సెక్రటరీలకు, వార్డు వలంటీర్లుకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ కె.షమ్మి హాజరై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కులగణనతో సామాజిక, ఆర్థిక పరమైన అభివృద్ధి జరుగుతుందన్నారు. కులగణన చేపట్టాలని నవంబర్ 3న కేబినెట్‌లో తీర్మానం చేయడం జరిగిందన్నారు. వలంటీర్ల లాగిన్ ద్వారా కులగణన నిర్వహించాలని తెలిపారు. కులగణనతోపాటు కుటుంబ సభ్యుల వివరాలు, కుటుంట సభ్యుల్లో ఎవరైన ఒకరు వేలిముద్ర వేస్తే సరిపోతుందని చెప్పారు. వారంలోగా కులగణన సర్వే పూర్తిచేయాలని తెలిపారు. అనతరం పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయ సెక్రటరీలు కులగణన సర్వే నిర్వహిస్తూనే తమ రోజు వారి విధులు కూడా నిర్వహించాలని సూచించారు. నిర్ణీత సమయంలో పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించాలని ఆయన తెలిపారు. మున్సిపల్ చైర్మన్ కొత్త వెంక సుబ్బారావు, వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుందుర్తి గురవాచారి, మున్సిపల్ కౌన్సిలర్లు కత్తెరపు వాసుదేవరెడ్డి, బంగారురెడ్డి, ముక్కంటి, జూలకంటి శ్రీనివాసరావు, ఉన్నం ఆంజనేయలు, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.



కులగణనపై అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్ కమిషనర్లు, మున్సిపల్ చైర్మన్

పేకాటరాయుళ్ల అరెస్ట్

నకరికల్లు: పేకాటస్థావరంపై దాడులు నిర్వహించి పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ ఏ బాలకృష్ణ మంగళవారం తెలిపారు. నకరికల్లు శివారు ప్రాంతంలో పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు దాడులు నిర్వహించి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న రూ.3,750 సీజ్ చేశామన్నారు.

నలందాలో ఉచిత డయాబెటీస్ ఆరోగ్య పరీక్ష శిబిరం

సత్తెనపల్లి: మీ ఆరోగ్యం కోసం ఒక రోజు కార్యక్రమంలో భాగంగా సత్తెనపల్లి మండలం కంటేపూడి సమీపంలోని నలంద గ్రూప్ విద్యాసంస్థల నందు మంగళవారం కొనాక్ డయాగ్నొస్టిక్స్ సత్తెనపల్లి వారి ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిస్ ఆరోగ్య పరీక్ష శిబిరం నిర్వహించారు. జనరల్ హెల్త్ ప్యాకేజీ కింద 31 పరీక్షలు, పూర్తి బాడీ హెల్త్ ప్యాకేజీ కింద 53 పరీక్షలు 40 శాతం తక్కువతో చేస్తామని ప్రకటించారు. ఇంజనీరింగ్, ఫార్మసీ, డిప్లమా కళాశాలల ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఓడీలు, టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది పరీక్షలు చేయించుకున్నారు. కళాశాలలో డయాబెటిస్ ఉచిత పరీక్షలకు అవకాశం కల్పించిన విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆరిమండ వరప్రసాద్ రెడ్డి, కళాశాల ఫౌండర్ సెక్రటరీ డాక్టర్ ఆరిమండ విజయ శారదారెడ్డికి కొనాక్ డయాగ్నొస్టిక్స్ సిబ్బంది, కళాశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

26న ఏజీకేఎంలో కార్తీక వన సమారాధన

సత్తెనపల్లి: పట్టణంలోని అన్నం గురవమ్మ కృష్ణమూర్తి డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 26న వెన్నా వారి వన సమారాధన జరుగుతుందని కమిటీ నిర్వాహకుడు వెన్నా అంజిరెడ్డి మంగళవారం తెలిపారు. కార్తీక వన సమారాధనకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని వెన్నా సోదర, సోదరీమణులు కుటుంబ సభ్యులతో హాజరు కావాలని కోరారు.

జీడీసీసీ బ్యాంకు సేవలకు అంతరాయం

అమరావతి: ది గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అమరావతి బ్రాంచిని నూతన భవనంలోకి మార్పు చేస్తున్నందు వల్ల రెండు రోజుల పాటు బ్యాంకు సేవలకు అంతరాయం కలుగుతుందని బ్రాంచి మేనేజర్ టి.సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం గంటలమ్మ చెట్టు సమీపంలో ఉన్న బ్రాంచి కార్యాలయాన్ని డోర్ నెంబర్ 6-20 శ్రీ చైతన్య స్కూల్ పక్కన శ్రీనివాస థియేటర్ రోడ్డుకు మారుస్తున్నామని తెలిపారు. బ్యాంకు వినియోగదారులు అర్థం చేసుకుని సహకరించాలని కోరారు. 24వ తేదీ బ్యాంకు సేవలు యథావిధిగా అందిస్తామని తెలిపారు.

క్లుప్తంగా

ఆడుదాం ఆంధ్రాపై అవగాహనా ర్యాలీ



మాచవరం: విద్యార్థులు ఆటల్లో రాణిస్తే మంచి గుర్తింపు లభిస్తుందని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి అన్నారు. మండలంలోని తురకపాలెం, వేమవరం, చెన్నాయపాలెం గ్రామ సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా-కుల గణనపై మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయి ఆటల పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు మండల, జిల్లా స్థాయిలో ఆడేందుకు అవకాశం ఉంటుందన్నారు. కుల గణన పట్ల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శివాయాదవ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, ఎంపీడీఓ వరప్రసాద్, ఆయా గ్రామాల సర్పంచులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

మిరపలో తామర పురుగు నివారణపై అవగాహన



వెల్దుర్తి: మండలంలోని మండాది గ్రామంలో మిరప పంట పొలాలను మాచర్ల ఉద్యాన అధికారి ఎస్.సురేష్ మంగళవారం పరిశీలించి మాట్లాడారు. నల్ల తామర పురుగు నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎకరాకు 200 కేజీల వేప పిండి భూమిలో వేయాలన్నారు. పురుగుమందులతో పాటు 10వేల పీపీఎం వేప నూనెను లీటర్‌కు 2ఎంఎల్ చొప్పున కలుపుకొని పిచికారీ చేయాలన్నారు. నత్రజని ఎరువులను అధిక మోతాదులో వాడకూడదన్నారు. బొబ్బర తెగులు నివారణకు ఆశించిన మొక్కలను ప్రారంభదశలోనే పీకేయాలన్నారు. తెల్లదోమ నివారణకు అఫిడో పైరోఫెన్ మందులను పిచికారీ చేయాలన్నారు. కాయకుళ్ళు, కొమ్ముకుళ్ళు గమనించినట్లయితే తగిన మందులను పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండాది ఈహెచ్‌ఏ చంద్రశేఖర్, మిరప సాగు రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు చరిత్రకు సజీవ సాక్ష్యాలు



విజయపురిసౌత్: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎన్ సరోజిని బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని చరిత్రకు సజీవ సాక్ష్యాలన్నారు. విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎం రమేష్‌నాయక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ టి.రాజశేఖర్‌రావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో హర్షితకు తృతీయ స్థానం



దుర్గి: మండల కేంద్రం దుర్గి సెక్రెహార్ట్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో తృతీయ స్థానాన్ని సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పీఈటీ పి.బాలకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 18,19,20 తేదీలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో అండర్ 14 విభాగంలో తమ స్కూల్ విద్యార్థిని బి.హర్షిత రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. హర్షితను కరస్పాండెంట్ టి.జాన్, ప్రిన్సిపాల్ శశి, పలువురు విద్యార్థులు అభినందించారు.

సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థుల ప్రతిభ

క్రోసూరు: రాష్ట్రస్థాయిలో అండర్ 14 విభాగం బాలబాలికల సాఫ్ట్ బాల్ పోటీల్లో క్రోసూరు సెయింట్ ఆన్స్ బాలికలు తృతీయ స్థానం సాధించారు. 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సాఫ్ట్‌బాల్ పోటీలు పెదకూరపాడు మండలంలోని వెనికగండ్ల వేమన జెడ్పీపాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీల్లో బాలికల విభాగంలో రీనా సిగ్మా ఫ్లారెన్స్, (8 వ తరగతి), దీవెన ఏంజెల్(ఏడవ తరగతి) రాష్ట్రస్థాయి పోటీల్లో తృతీయస్థానం సాధించారని పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ మేరీ మంగళవారం తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందటాన్ని పాఠశాల హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడు మక్కెన వెంకట్రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు అయ్యప్ప పడిపూజ

గురజాల : నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో బుధవారం అయ్యప్ప పడిపూజ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకుడు పోలా సతీష్ తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపంలో పడిపూజ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



పి.రాజారావు



ఎన్. ఏసయ్య

దాచేపల్లి : యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. నారాయణపురంలోని యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో అధ్యక్షుడిగా పి.రాంబాబుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నాగెండ్ల ఏసయ్య, ఉపాధ్యక్షులుగా షేక్ నాగుల్‌మీరా, వి.రత్నకుమారి, ప్రధాన కార్యదర్శిగా తగరం ఆనంద్‌కుమార్, కోశాధికారిగా జీవీ శ్రీనివాసరావు, మహిళ కార్యదర్శులుగా జీ స్వరూపదేవి, సీహెచ్ వెంకటరమణ, జీ సీతను ఎన్నుకున్నారు. ఈ ప్రక్రియ జిల్లా ప్రధాన కార్యదర్శి జీ విజయసారధి, కార్యదర్శి వట్టెపు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. నూతన కార్యవర్గ సభ్యులను నేతలు అభినందించారు.

పిడుగురాళ్ల: యూటీఎఫ్ పిడుగురాళ్ల మండల నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం పట్టణంలోని మన్నెంపుల్లారెడ్డి హైస్కూల్లో జరిగింది. పిడుగురాళ్ల మండల యూటీఎఫ్ నూతన గౌరవ అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి, అధ్యక్షుడు ఎంవీ సాంబశివరావు, సహాధ్యక్షురాలు ఆర్.రత్నకుమారి, ప్రధాన కార్యదర్శిగా షేక్ ఫిరోజ్, కోశాధికారిగా డి.శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకులు జేవీడీ నాయక్ తెలిపారు. నూతన కమిటీని పలువురు అభినందించారు. యూటీఎఫ్ రాష్ట్ర సీనియర్ నాయకులు చంద్రశేఖర్, పిడుగురాళ్ల, మాచవరం మండల శాఖల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలల చేత పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు

మానవ అక్రమ రవాణా సంస్థ పల్నాడు జిల్లా యూనిట్ ఎస్ఐ అల్లూరి రెడ్డి



పిడుగురాళ్ల: బాల కార్మికుల చేత పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మానవ అక్రమ రవాణా సవస్థ పల్నాడు జిల్లా యూనిట్ ఎస్ఐ అల్లూరి రెడ్డి తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో బాలకార్మికులపై ప్రత్యేక డ్రైవ్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా నవంబర్ 20 నుంచి డిసెంబర్ 20 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టామన్నారు. పట్టణంలోని జానపాడు రోడ్డులోని కన్యకపరమేశ్వరి సూపర్‌మార్కెట్‌ను, పలు మెకానిక్ షాపులు, సున్నం బట్టీలను పరిశీలించడం జరిగిందన్నారు. బాల కార్మికులు ఎక్కడా ప్రస్తుతానికి కనిపించలేదని ఈ సందర్భంగా తెలిపారు. పిడుగురాళ్ల కార్మికశాఖ సహాయాధికారిణి జి.నగరాజకుమారి, బాల కార్మికులు నిర్మూలనా సంఘం జిల్లా కన్వీనర్ డి.ఏడుకొండలు, చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ కోటేశ్వరరావు, ఏహెచ్‌టీయూ హెడ్ కానిస్టేబుల్ మంగమ్మ, చంద్రశేఖర్, బాలకార్మిక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

సత్తెనపల్లి: బాలల ఉజ్వల భవిష్యత్‌కు విద్యే మార్గమని న్యాయవాది బీఎల్ కోటేశ్వరరావు అన్నారు. మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి డీ నాగ వెంకటలక్ష్మి ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార కమిటీ, కార్మిక శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా మంగళవారం 5,6 వార్డుల ప్రజలకు ఆరో వార్డు సచివాలయ పరిధిలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా బాలల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వి.అన్నపూర్ణ, పారా లీగల్ వలంటీర్లు షేక్ సుభాని, ఖాజవలి, ముబారక్, కార్మిక శాఖ సిబ్బంది శ్రీనివాసరెడ్డి, సచివాలయ మహిళా పోలీసు షేక్ మస్తాన్ బీ పాల్గొన్నారు.